క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థులకు సూచనలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని అంబవరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు నిరుద్యోగ యువతి, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 5 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 65 మంది అభ్యర్థులు నెలకు రూ.11,500 నుంచి 20,000 జీతంతో ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథరెడ్డి, టీపీవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యోగాంజనేయులు

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఆ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతమైన వేంపల్లెలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, పాలిటెక్నిక్ లాంటి వృత్తి విద్య కోర్సులలో ఉత్తీర్ణత పొందిన వారు చాలా మంది ఉన్నారని, వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి టీవీ అరవింద్ మాట్లాడుతూ కొప్పర్తి ప్రాంతంలోని పారిశ్రామిక వాడలో ఉన్న ప్రముఖ జాతీయ సంస్థ డెక్సన్ వారు ముందుకొచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారి నంబరు: 9866888159కు సంప్రదించాలని వివరించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన జ్యోతి

కమలాపురం : కమలాపురం ఎంపీడీఓగా జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ఈమె పదోన్నతి పై కమలాపురం ఎంపీడీఓగా వచ్చారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న శేషా చలపతిని ఏవోగా నియమించారు. కాగా ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్న జ్యోతి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువయ్యేలా పర్యవేక్షిస్తామన్నారు. కాగా ఎంపీపీ గండి భారతి, వైస్ ఎంపీపీ చెన్నకేశవ రెడ్డి తదితరులు ఆమెను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సహారా కంపెనీ వద్ద నిరసన



కార్యాలయానికి తాళం వేసి ఉన్న దృశ్యాన్ని చూపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు: పట్టణంలో సహారా క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు వినియోగదారుల సొమ్ములకు గడువు తీరినా డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆ సంస్థ కార్యాలయానికి డీవైఎఫ్ఐ నాయకులు బాధితులతో కలిసి వెళ్లారు. అప్పటికే సంస్థ ప్రతినిధులు కార్యాలయానికి తాళాలు వేసి ఉండటంతో.. నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహారా సంస్థ ఏజెంట్ల ద్వారా నిరుపేద, మధ్య తరగతి ప్రజల నుంచి నెల, రోజు వారిగా డబ్బులు కట్టించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారు కట్టిన డబ్బులకు గడువు తీరిందన్నారు. తాము కట్టిన డబ్బులను చెల్లించాలంటూ సహారా సంస్థ ప్రతినిధులను అడిగితే.. డబ్బులు వచ్చిన తర్వాత చెల్లిస్తామంటూ తప్పుకుంటున్నారని వివరించారు. అధికారులు జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక తరలింపునకు అడ్డుకట్ట

చాపాడు : రేయింబవళ్లు తరలిస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ వెదురూరు గ్రామస్తులు ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మంగళవారం అడ్డుకున్నారు. గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఏడు టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారని వారు ఆరోపించారు. సమాచారం అందుకున్న ఎస్ఈడీ సీఐ మోహన్ రెడ్డి, చాపాడు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా పలు ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటాం

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- అన్ని గ్రామపంచాయతీల ప్రజలతో సమావేశం



ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు

తొండూరు : ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన తొండూరులో అన్ని గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డితో కలిసి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలిస్తూ వాటిని అధికారులచే పరిష్కరించారు. ముఖ్యంగా మల్లేల గ్రామప్రజలు జమ్మలమడుగు, కదిరి హైవే రోడ్డుకు తమకు సంబంధించిన ఇళ్లు, స్థలాలు కోల్పోతున్నామని, దీంతో తాము నివాసం ఉండేందుకు స్థలం కేటాయించి ఇళ్ల ఏర్పాటు చేయాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ముస్లింలు దర్గాకు సంబంధించి కాంపౌండ్ వాల్, ఈద్గా తదితర సమస్యలను ఆయనకు విన్నవించారు. అలాగే పైడిపాళెం నుంచి సంతకొవ్వూరు కెనాల్ కింద భూములు కోల్పోతున్న తమకు పరిహారం అందించాలని కొంత మంది రైతులు కోరారు. సైదాపురం గ్రామ ప్రజలు తమ గ్రామంలో ఉన్న డ్రైనేజీ తదితర సమస్యలను తెలిపారు. భద్రంపల్లె గ్రామ ప్రజలు పైడిపాళెం కెనాల్ నుంచి వచ్చే నీటిని సూక్ష్మనీటి సంపులలో నిల్వ ఉంచాలని, దీంతో 500 ఎకరాలకు సాగునీరు అందుతుందని విన్నవించారు. బూచుపల్లె గ్రామప్రజలు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. బోడివారిపల్లె గ్రామ ప్రజలు రావులకొలను, బోడివారిపల్లె గ్రామాలకు సంబంధించిన భూములు తొండూరు, సింహాద్రిపురం రెవెన్యూ మండలాల్లో ఉండడం వల్ల తమకు ఇబ్బందిగా ఉందని, తొండూరు మండల పరిధిలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అగడూరు, గంగాదేవిపల్లె, యాదవవారిపల్లె గ్రామ ప్రజలు గంగాదేవిపల్లె చెరువుకు ఎన్నో ఏళ్లుగా నీరు అందక అవస్థలు పడుతుండే వారిమని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేకంగా కెనాల్ ద్వారా నీరు అందించడంతో వ్యవసాయానికి బాగుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. గుండ్లమడుగు, కృష్ణంగారిపల్లె గ్రామ ప్రజలు డీకేటీ భూముల కోసం అసైన్మెంట్ కమిటీలో తమ పేర్లు లేవని, తమకు భూములు కల్పించాలని కోరారు. 5 బోరుబావుల కింద దాదాపు 30 మంది ఎస్సీ రైతులు విద్యుత్ కనెక్షన్‌లు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే ఎంపీ స్పందించి ఏడీ శ్రీకాంత్‌తో మాట్లాడి వారికి విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఊడవగండ్ల గ్రామ ప్రజలు తమ గ్రామం నుంచి అగడూరుకు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా, గ్రామస్తులు సచివాలయాలకు వెళ్లాలన్నా.. మొగనూరు వాగు నీటిలో దిగివెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సంతకొవ్వూరు, గంగనపల్లె, చెర్లోపల్లె, పోతలపల్లె, బలిజపల్లె గ్రామ ప్రజలు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించారు. చెర్లోపల్లెకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఆ గ్రామస్తులు కోరారు. తొండూరు, కోరవానిపల్లె గ్రామప్రజలు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించారు. అలాగే కోరవానిపల్లె- తొండూరు, బూచుపల్లె - తొండూరు, అగడూరు-తొండూరు, యాదవవారిపల్లె-అగడూరు గ్రామాలకు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న తారు రోడ్డును ఎంపీ చొరవ తీసుకుని వేయించడంతో ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. తుమ్మలపల్లె, తేళ్లూరు గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి సంబంధించిన సమస్యను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. పాలూరు, తదితర గ్రామాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించారు. అంతకు ముందు ఎంపీ తొండూరుకు రాగానే మండల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు గజమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, మండల పరిశీలకులు రామమునిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మోడల్ టౌన్ పనులపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో మోడల్‌టౌన్ అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడల్‌టౌన్ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. పనుల్లో అలసత్వం వహించకుండా శరవేగంగా పూర్తి చేయాలన్నారు. నగరవనం, బోలేవార్డు, సిటీ సెంటర్, శిల్పారామం, రింగురోడ్డు, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులు అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మోడల్‌టౌన్‌లో భాగంగా చేపడుతున్న 28 అంశాలకు సంబంధించి ఏయే పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, డీఎఫ్ఓ సందీప్, ఆర్డీఓ వెంకటేశు, కమిషనర్ నరసింహారెడ్డి, ఈఈ సిద్ధారెడ్డి, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేయించుకోవాలి



లింగాల : పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రమేష్



ఎర్రగుంట్ల : పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

లింగాల : ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. మంగళవారం లింగాల మండలం దొండ్లవాగు గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర అధికారులు పంట నమోదు ప్రక్రియ తనిఖీ చేస్తారని, ఏదైనా వ్యత్యాసాలు ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకొంటారని తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగానే పంటల బీమా, నష్టపరిహారం, సున్నావడ్డీ రుణాలు వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతాయని పేర్కొన్నారు. రైతులు గ్రామ రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రఫి, గ్రామ సర్పంచ్ రామమోహన్‌రెడ్డి, విద్యానందరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే..

ఎర్రగుంట్ల : ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే.. పొలంలో సాగు చేసిన పంటలను రైతులు నమోదు చేయించుకోవాలని కమలాపురం వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దనపాడు, చిలంకూరు గ్రామాల పరిధిలో సాగు చేసిన పత్తి, వేరుశనగ పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేరుశనగ పంటలో ప్రస్తుతం లద్దె పురుగు, ఆకుముడత పురుగుల ఉధృతి ఉన్నందున రైతులు నోవాల్యూరాన్ అనే మందును పిచికారి చేయాలని సూచించారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగుల ఉధృతి ఉన్నట్లుయితే ఫిప్రానిల్ రెండు మిల్లీలీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉద్యానవన పంటలకు ఈ నెల 15 వరకు, వ్యవసాయ పంటలకు ఈ నెల 30 వరకు ఈ పంట నమోదు చేసుకొనుటకు గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సతీష్, శిల్పా, మాధవి వినోద్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడా ఎంపికలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ అరుణ కుమారి



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

కమలాపురం : స్థానిక గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. మంగళవారం ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ అరుణ కుమారి ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాల బాలికలకు వేరు వేరుగా ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. 9 క్రీడాంశాల్లో ఈ పోటీలను నిర్వహించి నియోజకవర్గ స్థాయి టీంకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజం అన్నారు. ప్రతి ఒక్కరు క్రీడాంశాల్లో ఎంపిక కావాలనే స్ఫూర్తితోనే ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాణించిన గురుకుల విద్యార్థులు

స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్, షార్ట్‌పుట్ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తులశమ్మ తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ నరసమ్మ, పీఈటీలు సావిత్రి, అపర్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదయ్యే విధంగా చూడాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్ఓలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించాలన్నారు. వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. చాలా మంది యువతీయువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవటానికి ముందుకు రావడం లేదన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ఓటర్ల వివరాలతో పాటు మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, నూతన ఓటర్లు ఎవరైనా ఉన్నారో వారిని గుర్తిస్తే తమకు వివరాలను తెలియపరచాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన సమాచారం మేరకు తాము కూడా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి మరణించిన వారిని, ఇతర ప్రాంతాలలో ఉన్న వారిని గుర్తించి తొలగించడం జరుగుతుందన్నారు. నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో తిరిగి 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా చేర్చే విధంగా ఓటర్లను అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షఫి, రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ లక్ష్మీదేవి

కొండాపురం : గ్రామాల్లో సమస్యలు లేకుండా పరిష్కరించాలని అధికారులకు ఎంపీపీ లక్ష్మీదేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. యర్రగుడి, చామలూరు పునరావాస కేంద్రాల్లో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు నిర్మించాలని సభ దృష్టికి సర్పంచ్ రాఘవేంద్రరెడ్డి తీసుకొచ్చారు. యర్రగుడి పునరావాస కేంద్రంలో విద్యుత్ సమస్య ఉందని, తీర్చాలని సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఎస్. కొత్తపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాల వర్షాకాలంలో కారుతున్నదని, నాడు- నేడు కింద నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయాలని ఆయన పేర్కొన్నారు. సిరిగేపల్లె గ్రామంలో పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలన్నారు. పలు సమస్యలపైన ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. అంతకుముందు అజెండాలోని అంశాల వారీగా పురోగతని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.భారతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, ఉప మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు చింతా శంకర్‌రెడ్డి, బి. శివారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎల్.రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమ ఫలాలు



జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : జగనన్న ప్రభుత్వంలోనే గడప గడపకు సంక్షేమ ఫలాలు అందాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయం వద్ద నుంచి జెండామానువీధిలోని పలు ప్రాంతాల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సీఎం వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ సాయిశైలజలతో కలిసి ఆయన పర్యటించారు. జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే తెలియజేయాలన్నారు. సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని మన సత్తా చాటాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పుష్పవతి, ఖాదర్‌బాషా, పార్నపల్లి కిశోర్, బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు గురుప్రసాద్, ఆలయాల చైర్మన్లు నాగేంద్రప్రసాద్, సుధీకర్‌రెడ్డి, వాల్మీకి సంఘం డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐటిఐ సాయి, ఆంజనేయులు, జయప్రకాష్, రవి, సోఫాల వీరా, యార్వ వెంకటసుబ్బయ్య, తోటంశెట్టి హరికిశోర్, ఓతూరు రసూల్, కృష్ణమూర్తి, కోళ్లభాస్కర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, సిద్దయ్య, రాజేష్ నాయుడు, సంపత్, జయ, హరి, నవీన్, విష్ణు, ప్రశాంత్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా వినాయక చవితి జరుపుకోండి



మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ రాజు

పులివెందుల : మండలంలో వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అర్బన్ సీఐ రాజు అన్నారు. మంగళవారం సాయంత్రం వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని మత పెద్దలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కులమత విభేదాలకు తావివ్వకుండా సమష్టితో పండుగను జరుపుకోవాలన్నారు. పులివెందులలో హిందూ, ముస్లింల ఐక్యత మరువలేమన్నారు. ఈ బంధం ఇలాగే కొనసాగించి, ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. వీధుల్లో విగ్రహాలను ప్రతిష్టించే కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వీధుల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, పెద్ద మైకులు ఏర్పాటు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు స్వామి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జమ్మలమడుగు సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి, ప్రొద్దుటూరు కేవీఆర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఉచిత పరీక్షలు, మందులు అందజేస్తామని, ఆరోగ్యశ్రీలో గుర్తించిన వ్యాధులను పరీక్షించి రెఫర్ చేయనున్నట్లు మండల వైద్యాధికారి తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరు



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు

జమ్మలమడుగు : గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నయ్య పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రెండో రోజైన రిలే దీక్షలను మంగళవారం మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీస్‌తోపాటు అనుబంధ సంస్థలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, ఉపసంఘాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన మాదిగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు



ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

జమ్మలమడుగు : ప్రయాణికుల రద్దీ మేరకు బస్సు సౌకర్యం కల్పిస్తామని డిపో మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రమాణికులతో డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆళ్లగడ్డ-జమ్మలమడుగు రహదారిలో రాత్రి ఎనిమిదిన్నరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఉదయం పూట హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం తాడిపత్రి- జమ్మలమడుగు రహదారిలో ప్రయాణికుల రద్దీని పెంచడం కోసం గిఫ్టులను ప్రవేశపెట్టారు. టికెట్ కొన్న వారి పేర్లను డ్రా తీసి, విజేతలకు బహుమతులను అందించారు.

సంఘం అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు : సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని టీసీసీ అధ్యక్షుడు జాన్సన్ తెలిపారు. మంగళవారం వైఎంఆర్ కాలనీలోని టీసీసీ చర్చిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో కలిసి చర్చిస్తామన్నారు. సమావేశంలో డీసీ సునీల్ బాబు, అగస్టీన్ రాజు పాల్గొన్నారు.

కార్మికశాఖలో అక్రమాలు

– టీడీపీ హయాంలో స్కాంను వెలికితీయాలి



విలేకరులతో మాట్లాడుతున్న బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్ : టీడీపీ హయాంలో కార్మికశాఖలో అక్రమాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బూసిపాటి కిశోర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కంటే ఇది పెద్ద కుంభకోణమన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందుల కొనుగోలు విషయంలో అవినీతి జరిగిందన్నారు. మందుల ధరలను నాలుగు రెట్లు పెంచుకుని అవినీతికి పాల్పడ్డారని, తమ కమీషన్ల కోసం నాణ్యతని పరికరాలు కొనుగోలు చేశారని ఆరోపించారు. బినామీ ఏజెన్సీలతో మందులు కొనకపోయినా బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమాల వెనుక అప్పటి మంత్రులు అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని నారా లోకేష్‌కు సంబంధించిన ఏజెన్సీ పేరుతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని, అవినీతి వెనుక చంద్రబాబు హస్తం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఈఎస్ఐ అక్రమాలపై తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకొన్నారన్నారు. విచారణ చేపట్టి కార్మికుల సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు కార్మిక మంత్రి గుమ్మనూరు జయరాం, కేంద్ర కార్మికశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని దొరసానిపల్లెలోని గురాజి హైస్కూల్‌లో మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా కన్వీనర్‌గా మాదాసు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస ఆచారి, కార్యదర్శిగా సుబ్బరాయుడు, సంయుక్త కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు, వెంకటేష్, రాజా, ప్రతాప్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.